Oktelugu

క్షణం క్షణం.. నిఖార్సైన సమాచారం..

1 శుక్రవారం 7-8- 2026



# అమరావతి తొలి కీలక అడుగు

- 13న సీడ్ యాక్సెస్ రోడ్డు పనులు ప్రారంభం
- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాస సముదాయాలు సైతం
- రాజధాని పనులకు కొత్త ఊపు
- ఎమ్మెల్యే క్వార్టర్స్ అప్పగింత అమరావతి నిర్మాణంలో మైలురాయి.

**అమరావతి శకం మళ్లీ మొదలైంది!** కూటమి ప్రభుత్వం కసిగా వేస్తున్న అడుగులతో నవ్యాంధ్ర రాజధాని సరికొత్త రికార్డులకు సిద్ధమవుతోంది. ఆగస్టు 13న సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా రాజధానికి 'వెన్నెముక' లాంటి సీడ్ యాక్సెస్ రోడ్డు అందుబాటులోకి రావడంతో పాటు, అధునాతన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్ల ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. అంతేకాదు.. కేవలం 29 గ్రామాలకే పరిమితం కాకుండా విజయవాడ, గుంటూరులను కలుపుతూ అమరావతిని 'మెగా సిటీ'గా మార్చేందుకు మాస్టర్ ప్లాన్ రెడీ అవుతుండగా, కేంద్రం రూ.1,100 కోట్ల బూస్టర్ డోస్ ఇవ్వడంతో రాజధాని పునర్నిర్మాణం పండగ వాతావరణంలో ఊపందుకుంది!

(ఓకే తెలుగున్యూస్)

3వ పేజీలో




# ఉత్తరాంధ్ర వన్ సైడ్!

(ఓకే తెలుగున్యూస్)

- కూటమికి అనుకూల పవనాలు
- భోగాపురం విమానాశ్రయంతో మరింతగా వేవ్

2వ పేజీలో

# మెగాస్టార్ రీఎంట్రీ



- కూటమి ప్రభుత్వంలో కీలక బాధ్యతలు
- చంద్రబాబు,పవన్ ఆలోచన అదే

4వ పేజీలో

కొరియన్ కనకరాజ్ మూవీ రివ్యూ? హిట్టా? ఫట్టా? 8వ పేజీలో

# క్షుద్ర పూజలతో అధికారం వస్తుందా?



- క్షుద్ర పూజలపై తెలంగాణలో రాజకీయ రచ్చ
- హరీష్ యాత్రపై కాంగ్రెస్ విమర్శలు.
- మూఢనమ్మకాలపై మళ్లీ చర్చ.
- రాజకీయాల కోసం కొత్త ఆరోపణలు.
- విశ్వాసం వేరు.. మూఢనమ్మకం వేరు.

5వ పేజీలో

**రాజకీయ స్వార్థం ముందు** ఆధునిక సాంకేతికతైనా, కనీస విచక్షణైనా చిన్నబోవాల్సిందే అనడానికి తెలంగాణ రాజకీయాల్లో నడుస్తున్న ఈ 'క్షుద్ర ఆరోపణల' పర్వమే ప్రత్యక్ష నిదర్శనం. గ్రహాంతర ప్రయోగాలతో మానవుడు నయా శకంలోకి అడుగుపెడుతున్న వేళ... శాస్త్రవేత్తల పరిశోధనలు, సాంకేతిక ఆవిష్కరణలు లోకాన్ని శాసిస్తున్న కాలంలో... సీనియర్ రాజకీయ నాయకులు "క్షుద్ర పూజలు, తాంత్రిక విద్యల" చుట్టూ రాజకీయాలు అల్లడం పరాకాష్ట. తీర్థయాత్రలకు వెళ్లిన ప్రత్యర్థి నాయకుడిపై 'తంత్ర పూజల' ముద్ర వేస్తూ విమర్శలు గుప్పించడం కేవలం ప్రజల దృష్టిని మళ్లించే కుట్ర తప్ప మరొకటి కాదు. మూఢనమ్మకాల భయాన్ని రాజకీయంగా వాడుకుంటూ, ప్రజలను మభ్యపెట్టేలా నడుస్తున్న ఈ "పవర్ ఢ పొలిటికల్" డ్రామా వెనుక అసలు కథేంటి? రాజకీయ ప్రయోజనాల కోసం ఏ స్థాయికైనా దిగజారే నేతల నిజస్వరూపం ఏంటి? అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.







# ఉత్తరాంధ్ర వన్ సైడ్!

## కూటమికి అనుకూల పవనాలు
## భోగాపురం విమానాశ్రయంతో మరింతగా వేవ్

(ఓకే తెలుగున్యూస్)

ఉత్తరాంధ్ర పై టిడిపి కూటమి పట్టు బిగుస్తున్నట్లు అర్థం అవుతోంది. ఎందుకంటే ఉత్తరాంధ్రకు పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి. భారీ ప్రాజెక్టులు కళ్ళేదుటే కనిపిస్తున్నాయి. ప్రజల్లో కూడా సంతృప్తి కనిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో రాజకీయంగా తమకు కలిసి వస్తుందని కూటమి అంచనా వేసుకుంటోంది. మొన్నటి ఎన్నికల్లో కూటమి ఉత్తరాంధ్రలో ఘన విజయం సాధించింది. కేవలం రెండు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానంలో మాత్రం వైసిపి విజయం సాధించింది. అయితే ఇప్పుడు మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఉత్తరాంధ్ర మొత్తం కూటమి వశం అయ్యే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. దానికి కారణం అభివృద్ధి, పెట్టుబడులు, ఆపై మౌలిక వసతుల కల్పన. ఈ కారణాలతోనే కూటమి వైపు మరోసారి ఉత్తరాంధ్ర ప్రజలు మొగ్గు చూపే ఛాన్స్ కనిపిస్తోంది.

**కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు..**

మరోవైపు మిట్టల్ కంపెనీకి చెందిన స్టీల్ ప్లాంట్ అనకాపల్లి జిల్లాలో ఇప్పటికే ప్రారంభం అయింది. అయితే భారీగా ప్రభుత్వ రంగ సంస్థలు కూడా వస్తుండడం ఉత్తరాంధ్ర ప్రజల్లో సంతృప్తికి కారణం. ఐటీ పరిశ్రమల ఏర్పాటుకు సంబంధిత సంస్థలు ముందుకు వస్తున్నాయి. విశాఖ వేదికగా చాలా పరిశ్రమల రాక ప్రారంభం కూడా అయింది. మరోవైపు విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటయింది. కార్యకలాపాలు కూడా మొదలయ్యాయి. ఇది కూడా ఆహ్వానించదగ్గ పరిణామమే. ఈ విషయంలో సైతం ప్రజలు సంతృప్తిగా ఉన్నారు. ఉత్తరాంధ్ర నుంచి కొత్త రైళ్ల రాకపోకలు కూడా ప్రారంభం అయ్యాయి.

**గత రెండేళ్లలో అభివృద్ధి..**

నవ్యాంధ్రప్రదేశ్లో ఎప్పుడు జరగనంత అభివృద్ధి గత రెండేళ్ల కూటమిపాలనలో సాగింది. భారీగా పెట్టుబడులు కూడా వస్తున్నాయి. ఐటీ దిగ్గజ పరిశ్రమలు వచ్చాయి. ఇంకా వస్తూనే ఉన్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖ ఐటీ హబ్ గా మార్చాలని భావించింది. అందుకు తగ్గట్టుగానే ఐటీ అనుబంధ పరిశ్రమల రాక ప్రారంభం అయింది. ఇంకోవైపు ప్రపంచ దిగ్గజ గూగుల్ డేటా సెంటర్ నిర్మాణం విశాఖలో జరగనుంది. ఆసియా వెలుపల అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ కూడా ఇదే కావడం గమనార్హం. దేశంలోనే అత్యుత్తమ ప్రాజెక్టు ఇది. అటువంటి ప్రాజెక్టు ఉత్తరాంధ్రలో నిర్మితం కానుండడం నిజంగా ఈ ప్రాంతానికి ఒక గేమ్ చేంజర్ గా నిలవనుంది.

**భోగాపురం విమానాశ్రయం తో..**

తాజాగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం కావడం తో ఉత్తరాంధ్రలో సానుకూలత మరింత పెరిగింది. ఇప్పటివరకు విమానాశ్రయం అంటే ఉన్నత వర్గాలకు చెందినది అని భావించేవారు. కానీ ఇప్పుడు అందరి బతుకులు అందులో ఇమిడి ఉన్నాయని తెలుస్తుండడం ప్రజలను ఆకట్టుకుంటుంది. ఇలా వరుసగా ప్రాజెక్టులు, భారీ నిర్మాణాలు అందుబాటులోకి వస్తుండడంతో ప్రజల్లో కూటమిపట్ల సంతృప్తి పెరిగింది. అందుకే వచ్చే ఎన్నికల్లో కూటమికి ఉత్తరాంధ్ర ప్రజలు ఏకపక్షంగా ఆదరించే ఛాన్స్ కనిపిస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..





**అమరావతి రాజధాని నిర్మాణం సకాలంలో పూర్తిచేసి ప్రారంభించాలన్నది ప్రభుత్వ నిర్ణయం. వీలైనంత త్వరగా తొలి దశ పనులు పూర్తిచేసి ప్రారంభించాలన్న ఆలోచన చేస్తోంది ప్రభుత్వం. అందులో భాగంగా కీలకమైన మైలురాయి ఆవిష్కృతం కానుంది. అమరావతికి ప్రధాన జీవనాడిగా పరిగణించే సీడ్ యాక్సిస్ రోడ్డు పనులు దాదాపు పూర్తయ్యాయి. ఈనెల 13న సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించేందుకు సిఆర్డిప అధికారులు కసరత్తు చేస్తున్నారు. జాతీయ రహదారులను రాజధాని నగర పరిపాలన కేంద్రంతో అనుసంధానించే ఈ ప్రతిష్టాత్మక రహదారి అందుబాటులోకి రానుంది. తద్వారా రాజధాని ప్రాంతానికి రవాణా కనెక్టివిటీ సరికొత్త రూపురేఖలను సంతరించుకోనుంది.**

## అమరావతి
# తొలి అడుగు

## 13న సీడ్ యాక్సెస్ రోడ్డు పనులు ప్రారంభం

(ఓకే తెలుగున్యూస్)

కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే అమరావతి పునర్నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. 2028 నాటికి తొలిదశ పూర్తి చేయాలన్నది ఆలోచన. అయితే అత్యంత కీలకమైన సీడ్ యాక్సిస్ రోడ్డు అందుబాటులోకి రావడం శుభ పరిణామం. అదేరోజు అమరావతిలో నిర్మించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ బహుళ అంతస్తుల నివాస సముదాయాలను కూడా సాధారణ పరిపాలన శాఖకు అప్పగించనున్నారు. అత్యాధునిక వసతులు, గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలతో రూపుదిద్దుకున్న ఈ నివాస సముదాయాల అప్పగింతతో పాలనయంత్రాంగం రాజధాని నుంచే పూర్తిస్థాయిలో పని చేసేందుకు మార్గం సుగమం కానుంది. ఒకే రోజు సీడ్ యాక్సిస్ రోడ్డు ప్రారంభం, ప్రజా ప్రతినిధుల క్వార్టర్స్ అప్పగింత జరగడం సరికొత్త టర్నింగ్ పాయింట్ గా నిలవనుంది.

### ప్రపంచ స్థాయి నగరంగా..

ప్రపంచ స్థాయి నగరంగా అమరావతిని తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ బృహత్తర ప్రణాళిక. దానికి సీడ్ యాక్సిస్ రోడ్డు అనేది వెన్నెముక లాంటిది. విజయవాడ, గుంటూరులో నుంచి అమరావతి సచివాలయం, హైకోర్టు, అసెంబ్లీ తదితర కీలక ప్రాంతాలకు చేరుకోవడానికి ఇది ప్రధాన ప్రవేశ మార్గం. గతంలో నిలిచిపోయిన మౌలిక సదుపాయాల పనులను యుద్ధ ప్రాతిపదికిన ప్రారంభించింది కూటమి ప్రభుత్వం. స్వల్ప కాలంలోనే ప్రధాన రహదారులను, భవనాలను సిద్ధం చేసి ప్రారంభోత్సవానికి తీసుకురావడం చిన్న విషయం కాదు.

### పండుగ వాతావరణంలో..

ఆగస్టు 13 నవ్యాంధ్రప్రదేశ్లో ఒక పండుగ వాతావరణం నెలకొనే అవకాశం ఉంది. ఇప్పటికే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవంతో ఉత్తరాంధ్రలో ఒక సానుకూలత ఏర్పడింది. ఇప్పుడు అమరావతి రాజధాని లో కీలకమైన నిర్మాణాలను ప్రారంభించి రాష్ట్రవ్యాప్తంగా ఒక రకమైన అనుకూల వాతావరణం ఏర్పరచాలన్నది ప్రభుత్వ ఆలోచన. అమరావతికి ఒకవైపు కనెక్టివిటీ పెరుగుతుండడం, మరోవైపు ప్రజాప్రతినిధులు, అధికారులకు శాశ్వత నివాసాలు సిద్ధమవుతుండడంతో.. రాబోయే రోజుల్లో అమరావతిలో ఆర్థిక, పాలనాపరమైన కార్యకలాపాలు మరింత వేగం పుంజుకోనున్నాయి. ఈ నిర్మాణాలు అందుబాటులోకి వస్తుండడంతో మిగతా వాటిపై కూడా ప్రభావం చూపనుంది. వీలైనంత త్వరగా అవి పూర్తి అయ్యేందుకు అవకాశం కలగనుంది.

### అదే కసితో..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దూకుడు మీద ఉంది. ముఖ్యంగా అమరావతి విషయంలో వరుస నిర్ణయాలు తీసుకుంటుంది. 2028లో తొలిదశ పనులు పూర్తిచేసి ప్రారంభోత్సవం చేయాలన్న సంకల్పంతో ఉంది రాష్ట్ర ప్రభుత్వం. అలాగే విజయవాడ, అమరావతి మధ్య భవిష్యత్తులో కృష్ణా నదిపై వంతెనల నిర్మాణాల పైన కూడా నిర్ణయాలు తీసుకుంటున్నారు. అమరావతి పరిధిపై ఇప్పటికే స్పష్టత ఇచ్చారు. విజయవాడ, గుంటూరు కలిపి మెగా సిటీగా రాజధాని పైన పరిశీలన చేయాలని నిర్ణయించారు. తాజాగా అమరావతి ప్రణాళికలు,, నిర్ణయాల అమలుపైన సి ఆర్ డి ఏ అథారిటీ సమీక్ష చేసింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది.


### రాజధాని పరిధి పెంపు

ఇప్పటివరకు 29 గ్రామాలే రాజధాని పరిధిగా ఉండేది. అయితే ఇప్పుడు విజయవాడ, గుంటూరు కలిపి మెగాసిటీ చేయాలనే ప్రణాళికను పరిశీలన చేసి.. నిర్ణయాలు తీసుకోవాలని డిసైడ్ అయ్యారు. నిర్మాణంలో ఉన్న భవనాలు, రోడ్ల పైన అధికారులు వివరాలు సమర్పించారు. ఇన్నర్ రింగ్ రోడ్, రైల్వే లైన్ నిర్మాణానికి భూమిని కూడా సేకరిస్తున్నారు. మరోవైపు అమరావతి రాజధాని నిర్మాణ పనులను ఇప్పుడు చంద్రబాబు పర్యవేక్షిస్తున్నారు. పనుల్లో జాప్యం జరుగుతుండడం పై దృష్టి పెట్టారు. కేవలం 29 గ్రామాల పరిధితో మహానగరం నిర్మాణం అనేది అసాధ్యమని.. ఒకవైపు అమరావతి నిర్మాణం చేపడుతూనే... పరిధి పెంచుకుంటూ విజయవాడ, గుంటూరుకు విస్తరించాలన్నది ప్రభుత్వ ప్రణాళికగా తెలుస్తోంది.

### కేంద్రం సాయం..

మరోవైపు కేంద్ర ప్రభుత్వం అమరావతి రాజధానికి 1100 కోట్ల రూపాయలు మంజూరు చేసింది. ఇక్కడ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు శాశ్వత గృహ వసతి కల్పించనుంది. దీని ద్వారా వివిధ శాఖల అధికారులు అమరావతిలో స్థిరపడేందుకు... నగర పరిపాలన వ్యవస్థ వేగంగా విస్తరించినందుకు మార్గం సుగమం కానుంది.. కేంద్ర ప్రభుత్వ సాయాన్ని తీసుకోవడం ద్వారా ప్రాధాన్యత ప్రాజెక్టుగా ప్రపంచం గుర్తించేలా చూస్తున్నారు. మరోవైపు 29 గ్రామాలతో మహానగరం నిర్మించడం అసాధ్యమని.. భవిష్యత్తులో అటు విజయవాడ.. ఇటు గుంటూరు ను కలుపుతూ నిర్ణయం తీసుకోవడం వల్ల.. ఆ రెండు నగరాలకు ప్రాధాన్యం ఇచ్చినట్లు అవుతుంది. అక్కడ అభివృద్ధికి ఊతం ఇచ్చినట్లు అవుతుంది. ఈ ప్రకటన రెండు నగరాల అభివృద్ధికి గేమ్ చేంజర్ గా మారుతుంది అనడం ఎటువంటి అతిశయోక్తి కాదు.





# మెగాస్టార్ రీఎంట్రీ

## కూటమి ప్రభుత్వంలో కీలక బాధ్యతలు

## చంద్రబాబు,పవన్ ఆలోచన అదే

(ఓకే తెలుగున్యూస్)

మెగాస్టార్ చిరంజీవి రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. దాదాపు పుష్కర కాలంగా పాలిటిక్స్ కు గుడ్ బై చెప్పి సినిమాల్లో సెటిల్ అయ్యారు. పూర్తిగా బ్యాలెన్స్ పాటిస్తున్నారు. అన్ని రాజకీయ పార్టీలతో సఖ్యతగా మెలుగుతున్నారు. ఈసారి మరి రాజకీయాల జోలికి వెళ్ళనన్న నిర్ణయంతో ఉన్నారు మెగాస్టార్. ఈ విషయాన్ని పలు సందర్భాల్లో కూడా చెప్పుకొచ్చారు. అయితే ఇప్పుడు మెగాస్టార్ తిరిగి రాజకీయాల్లోకి వస్తారని ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా కూటమి ప్రభుత్వం లో కీలక బాధ్యతలు తీసుకుంటారని కూడా టాక్ నడుస్తోంది. మొన్నటి ఎన్నికల్లో జనసేనకు మద్దతు తెలిపారు చిరంజీవి. తద్వారా కూటమికి అనుకూల సంకేతాలు ఇచ్చారు. కూటమి ప్రభుత్వ ప్రమాణ స్వీకారానికి సైతం హాజరయ్యారు. అందుకే ఇప్పుడు చిరంజీవిపై జరుగుతున్న ప్రచారాన్ని ఎక్కువమంది నమ్ముతున్నారు.

### అందరితోనూ సఖ్యత..

చిరంజీవి రాజకీయాలను విడిచిపెట్టిన తర్వాత అన్ని రాజకీయ పక్షాలతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ప్రధాని మోదీతో సాన్నిహిత్యంగా ఉండేవారు. ఏపీలో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కెసిఆర్, తదనంతర పరిణామాలతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన జగన్, రేవంత్ రెడ్డి లతో ఎంతగానో గౌరవంగా మెలిగారు. వారు కూడా చిరంజీవి విషయంలో అంతే గౌరవం ఇచ్చారు. కానీ 2019లో జనసేన ఓటమి, పవన్ కళ్యాణ్ రెండు చోట్ల ఓడిపోవడం వంటి కారణాలతో ఎన్నెన్నో అవమానాలకు గురయ్యారు. అందుకే 2024 ఎన్నికల్లో తన సోదరుడు పవన్ కళ్యాణ్ కు మద్దతు ప్రకటించారు. కూటమిపట్ల సానుకూలత వ్యక్తం చేశారు. కూటమి వచ్చిన తర్వాత ప్రమాణ స్వీకారానికి హాజరయ్యారు.

### ప్రజారాజ్యం పార్టీ ద్వారా..

ఉమ్మడి రాష్ట్రంలోనే ప్రజారాజ్యం పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు చిరంజీవి. పార్టీని ఏర్పాటు చేసి అధికారంలోకి రావాలని భావించారు. 2009 ఎన్నికల్లో పోటీ చేసి ఉమ్మడి రాష్ట్రంలో 18 అసెంబ్లీ స్థానాలను తెచ్చుకున్నారు. అనుకున్న స్థాయిలో సీట్లు రాకపోవడంతో కొద్దిరోజులకే తన పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేశారు. కేంద్ర మంత్రి అయ్యారు. అయితే రాష్ట్ర విభజనతో కాంగ్రెస్ పార్టీ తెరమరుగయింది. అప్పటినుంచి గౌరవంగా రాజకీయాల నుంచి తప్పుకొని మళ్లీ సినిమా రంగంలో అడుగు పెట్టారు. దాంట్లోనే కొనసాగుతూ వస్తున్నారు.

### కేవలం ఒకే ఒక్క కారణంతో..

ప్రస్తుతం ఈ రాష్ట్రానికి డిప్యూటీ సీఎం గా పవన్ కళ్యాణ్ ఉన్నారు. మెగా బ్రదర్ నాగబాబు జనసేన కేలకనేతగా, ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. త్వరలో మంత్రి పదవి చేపట్టే అవకాశం ఉంది. ఈ పరిణామ క్రమంలో కూటమిపట్ల చిరంజీవి సానుకూలంగా ఉండాల్సిన అనివార్య పరిస్థితి. అయితే త్వరలో చిరంజీవిపై పెద్ద బాధ్యత పెట్టనున్నట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఒకవైపు అభివృద్ధి చేపడుతూనే సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోంది. ఈ క్రమంలో సంక్షేమ పథకాలకు సంబంధించి బ్రాండ్ అంబాసిడర్ గా చిరంజీవిని నిర్మించాలని చూస్తోంది. అయితే ఇప్పటికే చిరంజీవిని బిజెపిలోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ చేయని ప్రయత్నం అంటూ లేదు. కానీ చిరంజీవి మాత్రం రాజకీయాల్లోకి వచ్చే అవకాశం లేదని చెప్పారు. ఇటువంటి సమయంలో కూటమి ప్రతిపాదనను గౌరవిస్తారా? లేదా? అన్నది చూడాలి.

# శ్రీకాకుళంలో.. ఏం చేద్దాం

## రామ్మోహన్ నాయుడుపై గురిపెట్టిన జగన్

## సరైన అభ్యర్థి కోసం అన్వేషణ

(ఓకే తెలుగున్యూస్)

శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యుడుగా కింజరాపు రామ్మోహన్ నాయుడు వరుసగా మూడుసార్లు గెలిచారు. తండ్రి ఎర్రం నాయుడు అకాల మరణంతో పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు రామ్మోహన్ నాయుడు. ఎంట్రీ వరకు ఒకే కానీ.. రాజకీయాల్లోకి వచ్చి పదవి చేపట్టాక తన పట్టు పెంచుకుంటూ ముందుకు వెళుతున్నారు రామ్మోహన్ నాయుడు. ఇప్పుడు పార్టీతో పాటు వ్యక్తిగత చరిష్మ పెరగడంతో ఆయనను ఢీకొట్టే నాయకుడు ఇప్పుడు లేకుండా పోతున్నాడు. ప్రధానంగా ఇది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి లోటు. ఆ పార్టీ ఆవిర్భావం నుంచి మంచి విజయాలు దక్కించుకుంది కానీ.. శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ విషయానికి వచ్చేసరికి మాత్రం కొరకరాని కొయ్యగా మారిపోయింది. దీని విషయంలో ఎలా ముందుకు వెళ్లాలో కూడా తెలియడం లేదు జగన్మోహన్ రెడ్డికి. సరైన అభ్యర్థిని రంగంలోకి దించాలని చూస్తున్న ఆయన నేతలను ఎంపిక చేస్తుంటే.. తమ వల్ల కాదంటూ వారు తేల్చి చెబుతున్నారు. పోటీ చేసేది లేదు అంటూ పక్కకు తప్పుకుంటున్నారు. దీంతో జగన్మోహన్ రెడ్డికి ఏం చేయాలో పాలుపోవడం లేదు.

### వైసీపీకి లోటే..

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పార్లమెంట్ సీట్లను కైవసం చేసుకుంది. కానీ శ్రీకాకుళం, విజయవాడ, గుంటూరు సీట్లు మాత్రం ఆ పార్టీకి దక్కలేదు. ఆ మూడు సీట్లపై పూర్తిగా గురి పెట్టారు జగన్మోహన్ రెడ్డి. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని చూస్తున్నారు. అందులో భాగంగా శ్రీకాకుళం పార్లమెంటు నియోజకవర్గం గట్టిగానే



దృష్టిపెట్టారు. వాస్తవానికి ఇక్కడ చాలా రకాల ప్రయోగాలు చేశారు జగన్. తొలి ఎన్నికల్లో తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన రెడ్డి శాంతిని ప్రయోగించారు. కానీ ఫలితం లేకపోయింది. 2019లో దువ్వాడ శ్రీనివాసులు ప్రయోగించారు. రాష్ట్రవ్యాప్తంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం వీంచింది కానీ.. ఇక్కడ మాత్రం దువ్వాడ శ్రీనివాస్ నెగ్గలేకపోయారు. మరోవైపు 2024 ఎన్నికల్లో కాలింగ్ సామాజిక వర్గానికి చెందిన పేరాడ తిలక్ ను ప్రయోగించారు జగన్. కనీసం రామ్మోహన్ నాయుడు ముందు ఆయన నిలవలేకపోయారు.

### ఈసారి వెలమ లేక మత్స్యకారులకు..

అయితే జిల్లాలో, శ్రీకాకుళం పార్లమెంట్ స్థానంలో వెలమ, కాలింగ, తూర్పు కాపు సామాజిక వర్గాలు ఉన్నాయి. ఆపై మత్స్యకారులు కూడా అధికం. అయితే ఈసారి వెలమ సామాజిక వర్గానికి చెందిన నేతలను ప్రయోగించాలని జగన్ చూస్తున్నట్లు తెలుస్తోంది. ధర్మాన ఫ్యామిలీ నుంచి ఒకరిని రంగంలోకి దించాలని చూస్తున్నారు. ఎందుకంటే రామ్మోహన్ నాయుడు వెలమసామాజిక వర్గం కాబట్టి. ఆ సామాజిక వర్గంలో చీలిక తెస్తే ప్రయోజనం ఉంటుంది అనేది ఒక



అంచనా. ఆపై మత్స్యకార సామాజిక వర్గాన్ని సైతం ప్రోత్సహించే అవకాశం ఉంది. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును ప్రయోగిస్తారని టాక్ నడుస్తోంది.



# క్షుద్ర పూజలతో అధికారం వస్తుందా

సాంకేతిక యుగంలో మనిషి అడుగుపెట్టి చాలా సంవత్సరాలు దాటిపోయింది. టెక్నాలజీని ఉపయోగించుకొని తన జీవితాన్ని మరింత సుఖవంతం చేసుకోవడం పెరిగిపోయింది. ప్రతిది కూడా తన అదుపులో ఉండేలాగా మనిషి చూసుకుంటున్నాడు.

ప్రపంచ వ్యాప్తంగా పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. సాంకేతికత అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రతిదీ అనుకూలంగా మారిపోతుంది. నిన్న ఏం జరిగింది.. నేడు ఏం జరుగుతోంది.. రేపు ఏం జరగబోతోంది ఇలా అనేక విషయాలను మనిషి అత్యంత సులువుగా.. సులభంగా తెలుసుకుంటున్నాడు. ఇటువంటి కాలంలో క్షుద్ర పూజలకు అవకాశం ఉంటుందా.. తాంత్రిక విద్యల వల్ల మనిషి అనుకున్నది సాధించగలుగుతాడా.. అసలు క్షుద్ర పూజల వల్ల ఏం జరుగుతుంది.. ఇప్పుడు ఈ చర్చ ఎందుకు అంటే.. తెలంగాణ రాజకీయాలలో జరుగుతున్న పరిణామాలు ఆ విధంగా ఉన్నాయి కాబట్టి.

ఇటీవల మాజీ మంత్రి హరీష్ రావు తన కుటుంబంతో సహా తీర్థయాత్రలకు వెళ్లారు. ఆయనకు దైవభక్తి అధికంగా ఉంటుంది. పైగా ఆయన వెళ్ళింది ఇతర రాష్ట్రాల్లో ఉన్న క్షేత్రాలను సందర్శించుకోవడానికి. హరీష్ రావు తీర్థయాత్రల వ్యవహారంలో మరో కోణాన్ని చూశారు కాంగ్రెస్ నాయకులు. ఆయన క్షుద్ర పూజలు చేయడానికి ఆ క్షేత్రాలను సందర్శించారని వారు విమర్శిస్తున్నారు. రామ్మోహన్ రెడ్డి.. పిసిసి ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ వంటి వారు ఈ విమర్శలు చేయడం ఆసక్తికరంగా మారింది.

హరీష్ రావు ఉద్యమ నాయకుడు. రామ్మోహన్ రెడ్డి యువ నాయకుడు.. మహేష్ కుమార్ గౌడ్ సీనియర్ పొలిటిషన్. వాస్తవానికి హరీష్ రావు మీద ఈ స్థాయిలో రామ్మోహన్ రెడ్డి.. మహేష్ కుమార్ గౌడ్ ఆరోపణలు చేస్తారని తెలంగాణ రాష్ట్రంలో ఎవరు ఊహించలేదు. ప్రజా జీవితంలో ఉన్నవాళ్లు.. సాంకేతిక పరిజ్ఞానం మీద పట్టు ఉన్నవాళ్లు ఇలాంటి మాటలు మాట్లాడటం నిజంగా ఆశ్చర్యకరం. ఒకవేళ అటువంటి వాటి వల్ల అనుకున్నవన్నీ జరుగుతాయి అనుకుంటే. ఇదంతా ఎందుకు.. శాస్త్రవేత్తల మేథో మదనం ఎందుకు.. ఆవిష్కరణల కోసం ఈ స్థాయిలో తాపత్రయ పడటం ఎందుకు.. ఇదంతా జనాలను పిచ్చోళ్లను చేసే పని తప్ప మరోటి కాదు. అసలు విషయాలను పక్కనపెట్టి డైవర్ట్ రాజకీయాల కోసం నేతలు ఇలాంటి పనులు చేస్తుంటారని విశ్లేషకులు అంటున్నారు. మనదేశంలో అస్సాం రాష్ట్రంలో క్షుద్ర పూజలు ఎక్కువగా జరుగుతుంటాయని.. కామాఖ్య దేవి ఆలయంలో ఈ తరహా పూజలు నిర్వహిస్తుంటారని.. వీటి కోసం ఇతర దేశాలకు చెందిన వారు కూడా వస్తుంటారని సమాచారం. ఈ పూజల వెనుక ఏం జరుగుతుంది.. వారి లక్ష్యాలు ఏంటి అనే విషయాలను పక్కన పెడితే.. క్షుద్ర పూజల వల్ల మనుషులను వశం చేసుకోవడం.. లక్ష్యాలను సాధించడం సాధ్యం కాదు. ఎందుకంటే వెనుకటి కాలంలో ఇటువంటి వాటి మీద నమ్మకం ఉండేది. కార్యక్రమంలో సాంకేతిక పరిజ్ఞానాల మీద మనిషికి పట్టు పెరగడం వల్ల అన్ని విషయాలు తెలుస్తున్నాయి. ఇటువంటి రోజుల్లో కూడా ఈ మూఢ నమ్మకాల మీద కొంతమంది నమ్మకం పెంచుకోవడం.. వాటిని వ్యాప్తి చెందించడం నిజంగా అవివేకం. సినిమాలలో చూపించినట్టు.. క్షుద్ర పూజలు.. తాంత్రిక విద్యలు ఉండవు. వాటి ద్వారా ఆ స్థాయిలో అనుకున్నవి జరగవు. కొంతమంది దేవుడు ఉన్నట్టే.. దయ్యాలు కూడా ఉంటాయని చెబుతుంటారు. దేవుడు అనేది నమ్మకం. మనల్ని నడిపించే ఒక విశ్వాసం. దయమనేది ఒక భయం. మనల్ని ఇబ్బంది పెట్టె ఒక భ్రాంతి. అలాంటప్పుడు విశ్వాసాన్ని మాత్రమే నమ్మాలి. నమ్మకాన్ని మాత్రమే అనుసరించాలి. భయాన్ని.. భ్రాంతిని నమ్ముకుంటే ముందడుగు వేయలేం. రాజకీయ నాయకులు ఏదేదో మాట్లాడుతుంటారు. నరం లేని నాలుకలాగా పిచ్చిపిచ్చిగా మాట్లాడుతుంటారు. వాటిని నమ్మకూడదు. రాజకీయ నాయకుల మాటలను జస్ట్ ఇలా విని అలా వదిలేయాలి. ఎందుకంటే రాజకీయం కోసం రాజకీయ నాయకులు ఏదైనా చేస్తారు.. తమ ప్రయోజనాల కోసం ఎంతకైనా దిగజారుతారు. గతం చెప్పేది అదే. వర్తమానం చెబుతున్నది అదే. భవిష్యత్తు చెప్పబోయేది కూడా అదే.

క్షుద్రపూజలు (లేదా చేతబడి, మంత్రతంత్రాలు) అనేవి సమాజంలో ప్రాచీన కాలం నుండి నమ్మకాలుగా వస్తున్న రహస్య ఆచారాలు. సంస్కృతంలో 'క్షుద్ర' అంటే అల్పమైన లేదా నీచమైన అని అర్థం. స్వార్థ ప్రయోజనాల కోసం, ఇతరులకు హాని కలిగించడం కోసం లేదా గుప్త నిధులు, అతీత శక్తుల కోసం చేసే పూజలను సాధారణంగా క్షుద్రపూజలుగా భావిస్తారు.

లక్ష్యాలుస్వార్థం: శత్రువులపై పగ తీర్చుకోవడం లేదా ఇతరుల నాశనాన్ని కోరుకోవడం.

ధనాశ: లంకె బిందెలు, గుప్త నిధులు దక్కించుకోవాలనే దురాశ.
ఆరోగ్య సమస్యలు: దీర్ఘకాలిక రోగాల నుండి విముక్తి కోసం లేదా ఇతరులకు రోగాలు కలిగించడం కోసం.

వశీకరణం: ఇతరులను తమ ఆధీనంలోకి తెచ్చుకోవడానికి చేసే ప్రయత్నాలు.సాధారణంగా ఉపయోగించే వస్తువులుఈ తరహా పూజల్లో తరచూ కింది వస్తువులను వాడుతుంటారు

నిమ్మకాయలు, కుంకుమ, పసుపు.కోడి గుడ్లు, ఎండు మిరపకాయలు.బొమ్మలు (బొమ్మలపై పిన్నులు గుచ్చడం).
జంతు బలులు లేదా రక్తం,చట్టం,సామాజిక దృక్పథంమూఢనమ్మకం: ఆధునిక సైన్స్,హేతువాదం ప్రకారం ఇవి కేవలం భ్రమలు,మూఢనమ్మకాలు మాత్రమే. వీటికి ఎటువంటి శాస్త్రీయ ఆధారాలు లేవు.

శిక్షార్హమైన నేరం: క్షుద్రపూజల పేరుతో నరబలులు ఇవ్వడం, జంతువులను హింసించడం, మహిళలపై చేతబడి నెపంతో దాడులు చేయడం చట్టరీత్యా తీవ్రమైన నేరాలు.

చట్టాలు: భారతదేశంలోని పలు రాష్ట్రాల్లో (ఉదాహరణకు మహారాష్ట్ర, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో) ప్రత్యేకంగా "చేతబడి, క్షుద్రపూజల నిరోధక చట్టాలు" అమలులో ఉన్నాయి.



## బోండా ఉమా వర్సెస్ మల్లాది విష్ణు

ఏపీ రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో అక్రమాలు జరిగాయని వైసిపి ఆరోపిస్తోంది. ఢిల్లీలో నీట్ తరహాలో జరిగినట్టుగానే ఏపీలో కూడా ఉద్యమం నిర్వహించాలని.. ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలని వైసీపీ భావిస్తోంది. అందువల్లే సొంత మీడియా.. సొంత యూట్యూబ్ ఛానల్స్.. సొంత సోషల్ మీడియా ద్వారా రకరకాలుగా ప్రచారం చేస్తోంది.
జగన్ ఆదేశాల మేరకు వైసీపీ నేతలు దీక్షలు చేస్తున్నారు. దీక్షలలో డీఎస్సీ వ్యవహారం వరకు వైసిపి నేతలు ఆగిపోయి ఉంటే బాగుండేది. కానీ వారు ప్రభుత్వం మీద లేనిపోని ఆబాండాలు వేస్తున్నారు. ప్రజలను రెచ్చగొట్టే విధంగా ప్రకటనలు చేస్తున్నారు. వ్యక్తుల మధ్య.. కులాల మధ్య కుంపట్లు రగిలించేందుకు కుట్రలు చేస్తున్నారు. మొదట్లో ఈ వ్యవహారాన్ని పెద్దగా టిడిపి నేతలు పట్టించుకోలేదు. కానీ ఇప్పుడు పట్టించుకోకుంటే బాగోదని భావించి.. వారి స్టైల్లో యాక్షన్ తీసుకుంటున్నారు.
విజయవాడలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆధ్వర్యంలో డీఎస్సీలో అక్రమాలు జరిగాయి అంటూ దీక్ష చేస్తున్నారు. ఈ దీక్ష కార్యక్రమంలో ప్రభుత్వాన్ని తీవ్ర స్థాయిలో విమర్శించడం.. అనవసరమైన విషయాల జోలికి వెళ్లడంతో.. ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు రంగంలోకి దిగాల్సి వచ్చింది. ముత్యాలపాడు ప్రాంతంలో మల్లాది విష్ణు చేస్తున్న దీక్ష వద్దకు ఉమామహేశ్వరరావు వెళ్లారు. ఆయన వెంట టిడిపి కార్యకర్తలు కూడా ఉన్నారు. ఉమామహేశ్వరరావు రాగానే.. మల్లాది విష్ణు వర్గం నాయకులు కూడా తెరమీదికి వచ్చారు. దీంతో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం లో పరిస్థితి ఒక్కసారిగా అదుపుతప్పింది. విష్ణు టెంట్ ను టిడిపి నేతలు తొలగించారు. దీంతో వైసిపి నాయకులు ఆందోళనకు దిగారు. అటు టిడిపి నాయకులు కూడా తగ్గేది లేదు అన్నట్టుగా దూసుకు వచ్చారు..
అటు వైసిపి కార్యకర్తలు.. ఇటు టిడిపి కార్యకర్తలు పరస్పరం దాడులకు దిగారు. పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో అక్కడ పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఉమామహేశ్వరరావు రావడం.. మల్లాది విష్ణు గట్టిగా నినాదాలు చేయడంతో.. అసలు అక్కడ ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి. చివరికి పోలీసులు వచ్చి ఇరు వర్గాలను చెదరగొట్టడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. కాగా టిడిపి నేతలు అకారణంగా తమ టెంట్ తొలగించారని వైసీపీ నేతలు అంటుంటే.. రెచ్చగొట్టే విధంగా మాట్లాడితే పనిష్మెంట్ ఇదే విధంగా ఉంటుందని టిడిపి నేతలు చెబుతున్నారు. మొత్తానికి ఈ వ్యవహారం విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం లో హాట్ టాపిక్ గా మారింది.

# పీవీ సింధు మీద వైసిపి బ్యాచ్ ట్రోలింగ్

ఒలంపిక్స్ లో మెడల్ విన్నర్.. బ్యాడ్మింటన్ ఛాంపియన్.. అనేక పతకాలు సాధించిన విజేత. పైగా మన తెలుగు బిడ్డ.. ఇంతటి ఖ్యాతి ఉన్న పీవీ సింధును వైసిపి బ్యాచ్ టార్గెట్ చేసింది.. సోషల్ మీడియాలో విషం చిమ్ముతుంది.
పీవీ సింధు చాలా కష్టపడి బ్యాడ్మింటన్ స్టార్ గా ఎదిగింది. ఎటువంటి నేపథ్యం లేకపోయినప్పటికీ ఈ స్థాయి దాకా వచ్చింది. మువ్వన్నెల జెండాకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చింది. చైనా ప్లేయర్లు దూకుడు కొనసాగిస్తున్న వేళ.. అమెరికన్ ప్లేయర్లు అదరగొడుతున్న వేళ.. సింధు భారత గర్వాన్ని ప్రపంచ దేశాల ముందు రెపరెపలాడించింది. చివరికి ఒలంపిక్స్ లాంటి అంతర్జాతీయ పోటీలలో మెడల్స్ సాధించి భారత దేశ స్థాయిని పెంచింది. ఈ స్థాయిలో ప్రతిభ చూపించిన క్రీడాకారిణికి ఏ ప్రభుత్వమైనా సరే గుర్తింపు ఇస్తుంది. నగదు నజరానా ప్రకటిస్తుంది. అవసరమైతే అకాడమీ ఏర్పాటు చేసుకోవడానికి స్థలం కూడా ఇస్తుంది. ఇలాంటి విధానం మన దేశంలో కొత్త కాదు. పైగా క్రీడాకారులకు ఇటువంటి సదుపాయాలు కల్పించడం వల్ల వాళ్లు భవిష్యత్తులో మరింత గొప్పగా రాణిస్తారని.. వారిని ఆదర్శంగా తీసుకొని చాలామంది యువత క్రీడల వైపు దృష్టిస్తారని ప్రభుత్వం నమ్ముతూ ఉంటుంది.

పీవీ సింధు సాధించిన విజయాల నేపథ్యంలో జగన్ ఆధ్వర్యంలో ప్రభుత్వం అకాడమీ ఏర్పాటుకు స్థలం కేటాయించింది. అప్పట్లో భూమి పూజ కూడా ఏర్పాటు చేశారు. అయితే నాటి రోజుల్లో పీవీ సింధుకు కేవలం బ్యాడ్మింటన్ అకాడమీ మాత్రమే ఏర్పాటు చేయాలని ఉండేది. ఇటీవల కాలంలో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును పీవీ సింధు కలిసింది. ఆయన ఏపీలో బ్యాడ్మింటన్ అకాడమీ మాత్రమే సరిపోదని.. అంతకుమించిన స్థాయిలో ఉండాలని సూచించారు. దీంతో ఆయన సూచనల మేరకు తనకు కేటాయించిన స్థలంలో బ్యాడ్మింటన్ క్రీడలకు సంబంధించిన ఇతర నిర్మాణాలు చేపట్టాలని సింధు భావించింది.

ఈ నేపథ్యంలోనే పెద కదిలి ప్రాంతంలో ఆ నిర్మాణాలకు తన తండ్రి.. తల్లితో కలిసి పూజ నిర్వహించింది. దీనిని వైసీపీ బ్యాచ్ నెగిటివ్గా తీసుకుంది. ఇంకేముంది తన అనుకూల సోషల్ మీడియా గ్రూపులలో పివి సింధు మీద విష ప్రచారం చేయడం మొదలుపెట్టింది.



ఇది పీవీ సింధు దృష్టికి వెళ్లడంతో.. ఆమె రెస్పాండ్ అయింది. జరిగిన ఘటన విషయంలో క్లారిటీ ఇచ్చింది. తనను అనవసరంగా ఇబ్బంది పెట్టొద్దని స్వీట్ వార్నింగ్ కూడా ఇచ్చింది.
మరి ఇప్పటికైనా వైసీపీ బ్యాచ్ ఆగుతుందా.. సింధు మీద విష ప్రచారాన్ని చేయకుండా ఉంటుందా.. జరిగిన విషయం మీద క్లారిటీ ఇచ్చిన తర్వాత వైసిపికి ఇదంతా అర్థమవుతుందా.. ఇప్పుడు ఇవే ప్రశ్నలను టిడిపి నేతలు వేస్తున్నారు. ప్రతి అంశాన్ని కూడా రాజకీయం కోసం వాడుకోవడం.. వ్యక్తులను కించపరచడం వైసిపికి అలవాటుగా మారిందని టిడిపి నేతలు అంటున్నారు.

## జట్టులో వీళ్లు ఉంటేనే.. టీమిండియా వన్డే వరల్డ్ కప్ గెలుస్తుందట..

వైట్ బాల్ ఫార్మాట్ లో టీం ఇండియా ప్రస్తుతం నెంబర్ వన్ స్థానంలో కొనసాగుతోంది. ఇటీవల ఇంగ్లాండ్ జట్టుతో జరిగిన వన్డే సిరీస్ కోల్పోయినప్పటికీ.. టీమిండియా వన్డే ర్యాంకింగ్స్ విషయంలో అగ్రస్థానంలో కొనసాగుతోంది.
2027 వన్డే వరల్డ్ కప్ ఎలాగైనా గెలవాలని టీమిండియా బలంగా నిర్ణయించుకుంది. అందువల్లే జట్టు విషయంలో.. ఆటగాళ్ల విషయంలో అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నది.
2027 వన్డే వరల్డ్ కప్ జరగడానికి ఇంకా సమయం ఉంది.
అయినప్పటికీ మేనేజ్మెంట్ ఏ విషయాన్ని నిర్లక్ష్యం చేయడం లేదు. బ్యాటింగ్.. బౌలింగ్ కోచ్ ల పదవి కాలం ముగిసిన తర్వాత.. కొత్త వాళ్లను నియమించుకుంది. పాత వాళ్లకు ఏమాత్రం పొడిగింపు అవకాశం ఇవ్వలేదు.
జట్టులో ఆటగాళ్ల విషయంలో కూడా మేనేజ్మెంట్ అనేక రకాలుగా జాగ్రత్తలు తీసుకుంటున్నది. సరిగ్గా ఆడలేని ప్లేయర్లను పక్కన పెడుతున్నది. సరిగ్గా ఆడుతున్న ప్లేయర్లకు విస్తృతంగా అవకాశాలు ఇస్తున్నది. జట్టుకు పనికి వస్తారు అనుకునే ప్లేయర్లకు బెంగళూరులో శిక్షణ ఇస్తున్నది. మొత్తానికి బృహత్




ప్రణాళికతో టీమిండియా మేనేజ్మెంట్ బలమైన అడుగులు వేస్తోంది.
వచ్చే వన్డే వరల్డ్ కప్ దక్షిణాఫ్రికా వేదికగా జరుగుతుంది. అక్కడి మైదానాలు చాలా విచిత్రంగా ఉంటాయి. వికెట్లకు అనుకూలిస్తాయి. అదే సమయంలో పరుగుల వరద సాగడానికి దోహదం చేస్తాయి. ఇటువంటి మైదానాల మీద ఎటువంటి ఆటగాళ్లు ఉంటే టీమిండియా వన్డే వరల్డ్ కప్ గెలుస్తుందో మాజీ ఆటగాడు దినేష్ కార్తీక్ చెప్పాడు.
ఇటీవల అతడు ఒక స్పోర్ట్స్ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చాలా ఆసక్తికరమైన విషయాలు పంచుకున్నాడు. వచ్చే వన్డే వరల్డ్ కప్ దక్షిణాఫ్రికా వేదిక జరుగుతుంది కాబట్టి.. కచ్చితంగా ప్లేయర్ల ఎంపికలో మేనేజ్మెంట్ జాగ్రత్త వహించాలని సూచించాడు.
దక్షిణాఫ్రికా గడ్డమీద అద్భుతమైన రికార్డు ఉన్న ఆటగాళ్లకు అవకాశాలు ఇవ్వాలని.. ఒకవేళ ఆ ప్లేయర్ల ఆట తీరు సరిగా లేకపోతే.. శిక్షణ ఇచ్చి మెరుగుపరచాలని సూచించాడు.

జట్టుకు నాయకుడిగా గిల్ ఉండాలని.. జట్టులో రోకో లేకుండా వరల్డ్ కప్ అసాధ్యమని కార్తీక్ స్పష్టం చేశాడు. అయ్యర్.. రాహుల్.. పాండ్యా.. కులదీప్.. బుమ్రా.. సిరాజ్.. శమీ.. కిషన్.. జైస్వాల్.. భువనేశ్వర్.. నితీష్ వంటి ఆటగాళ్లతో జట్టును ప్రకటిస్తే టీమిండియాకు ఎదురు అనేది ఉండదని దినేష్ కార్తీక్ అభిప్రాయపడ్డాడు. అయితే ఇతని అభిప్రాయంతో మెజారిటీ అభిమానులు మాత్రమే కాదు.. మాజీ ప్లేయర్లు కూడా ఏకీభవిస్తున్నారు.

## బోనం ఎత్తిన కావ్య పాప

### పోతురాజులుగా ఇషాన్.. క్లాసెన్

ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో బోనాల పండుగ జరుగుతుంది. ఈసారి హైదరాబాద్ జట్టు ఓనర్ కావ్య నెత్తి మీద బోనం పెట్టుకొని అమ్మవారికి సమర్పించింది. ఆమె పక్కనే పోతురాజులు మాదిరిగా ఇషాన్ కిషన్.. క్లాసెన్ ఉన్నారు. ఇదేంటి ఇది ఎలా సాధ్యం అనుకుంటున్నారా.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మహిమ. కొందరు టెక్నాలజీని ఉపయోగించి ఈ చిత్రాన్ని రూపొందించారు.




18 ఏళ్ళు వచ్చాక అమ్మాయిలను చూసి

## సూర్య వంశీ ఆగుతాడా..

వైభవ్ సూర్య వంశీ టీమ్ ఇండియా క్రికెట్లో యంగ్ సెన్సేషన్. ఇతడు ఆడుతుంటే తుఫాన్ స్థాయిలో ఉంటోంది. అతడు పరుగులు తీస్తుంటే మెరుపు వేగం కళ్ళ ముందు కనిపిస్తోంది. అతడు దూకుడుగా బ్యాటింగ్ చేస్తుంటే సంచలనం నమోదవుతోంది.
సూర్య వంశీ ఇప్పటికే అనేక సందర్భాలలో తనను తాను నిరూపించుకున్నాడు. కొత్తగా అతని గురించి చెప్పాల్సింది ఏమీ లేదు. పైగా అతని బ్యాటింగ్ అంచనాలకు మించి సాగుతోంది. ప్రత్యర్థి జట్టుతో సంబంధం లేదు. వేదికతో సంబంధం లేదు. బౌలర్ తో పనిలేదు. అతడికి కావలసింది కేవలం పరుగులు. అది కూడా లిప్త పాటు కాలంలో.. తక్కువ బంతుల్లో.. అందువల్లే అతడిని బేబీ బాస్ అని పిలుస్తున్నారు.
గేల్ లాంటి ప్లేయర్ల సైతం అతడి ఆట చూసి మైమరిచి పోతున్నారంటే మామూలు విషయం కాదు. పైగా అతడు పరుగులు తీయడంలో సరికొత్త బెంచ్ మార్క్ సృష్టిస్తున్నాడు. అతడి జోరు ఇలానే కొనసాగితే టీమ్ ఇండియాకు ఎదురు అనేది ఉండదని మాజీ క్రికెటర్లు చెబుతున్నారు. ఇదే సమయంలో రాబిన్ ఊతప్ప లాంటి సీనియర్ ప్లేయర్లు హెచ్చరికలు కూడా జారీ చేస్తున్నారు.
వైభవ్ సూర్య వంశీ వయసు ప్రస్తుతం 15 సంవత్సరాలు మాత్రమేనని.. అతడికి 18 సంవత్సరాలు వయసు వచ్చేసరికి అమ్మాయిలు అటెన్షన్ మార్చుతారని.. దానిని ఎంతవరకు నిగ్రహించుకోగలిగితే అతడు తన కెరియర్ అంత గొప్పగా మార్చుకోగలుగుతాడని ఊతప్ప చెబుతున్నాడు. వైట్ బాల్ ఫార్మాట్ మొత్తాన్ని మార్చేయగలిగే శక్తి అతడికి




ఉందని.. కాకపోతే స్వీయ నియంత్రణ అతడు పాటించాల్సిన అవసరం ఉందని ఊతప్ప పేర్కొన్నాడు. సచిన్ మాదిరిగానే వైభవ్ కు అద్భుతంగా ఆడే సత్తా ఉందని.. అతడు దానిని మరింత మెరుగుపరుచుకుంటే అద్భుతమైన ఆటగాడిగా రూపాంతరం చెబుతాడని ఊతప్ప వివరించాడు.
"బేబీ బాస్ వయసు ప్రస్తుతం 15 సంవత్సరాలు. అతడు పూర్తిస్థాయిలో ఆట మీద దృష్టి కేంద్రీకరిస్తే అద్భుతాలు సృష్టించగలుగుతాడు. అతని బ్యాటింగ్ అంచనాలకు మించి సాగుతోంది. టీమిండియాలో సచిన్ ఎలాంటి ప్రమాణాలు నెలకొల్పాడో .. అంతకుమించి నెలకొల్పే సామర్థ్యం సూర్య వంశీకి ఉంది. అలాంటప్పుడు అతడు తన వయసు పెరుగుతున్నప్పుడు.. ముఖ్యంగా టీనేజీలో అమ్మాయిల విషయంలో ఎంత జాగ్రత్తగా ఉంటే అంత మంచిదని.. అదే అతడి కెరియర్ మొత్తాన్ని నిర్దేశిస్తుందని" వైభవ్ సూర్యవంశీని ఉద్దేశించి రాబిన్ ఊతప్ప ఈ సందర్భంగా వివరించాడు.

# మనీషులు

## తండ్రికి ఆన్లైన్లో అంత్యక్రియలు.. కన్న ప్రేమ కాలగర్భంలో.. పేగు బంధం బూడిదలో..

ఆ మధ్య తెలంగాణ రాష్ట్రంలోని భూపాలపల్లి జిల్లాలో ఓ రోడ్డు ప్రమాదం జరిగింది . వేగంగా వచ్చిన వాహనం ఒక కోతిని ఢీకొట్టింది. ఆ కోతి చనిపోయింది. దాదాపు ఆ రోడ్డు మీద 200 వరకు కోతులు గుమి గూడాయి. చనిపోయిన ఆ కోతిని పట్టుకొని ఒక నిర్మానుష్యమైన ప్రాంతంలో వేశాయి.

చూసేవాళ్ళకు ఆ దృశ్యం మామూలుగా ఉన్నప్పటికీ.. తమతోపాటు ఇన్నాళ్లపాటు జీవించిన ఒక జీవిని తోటి జీవులు ఎలా తీసుకెళ్లాయో.. అది చనిపోతే ఎంత బాధ పడ్డాయో ఆ దృశ్యం కళ్ళకు కట్టింది. అంతేకాదు, తోటి జీవి చనిపోతే ఆ బాధ ఎలా ఉండాలో మనుషులకు చూపించాయి కోతులు. కోతి నుంచి రకరకాలుగా అభివృద్ధి చెంది.. అత్యధిక మేధస్సు కలిగిన జీవిగా రూపాంతరం చెందిన మనిషి మాత్రం.. హీనంగా మారిపోతున్నాడు..

సభ్య సమాజంలో రోజురోజుకు మనుషుల మధ్య ప్రేమ తగ్గిపోతోంది. అనుబంధం కాలగర్భంలో కలిసిపోతుంది. కేవలం మనుషులకు మాత్రమే సొంతమైన ఆప్యాయత విలుప్తమవుతోంది. అనురాగం.. అనుబంధం మాయమైపోతుంది.. చివరికి తోటి మనుషులు చనిపోతే అంత్యక్రియలకు కూడా హాజరు కాలేని పరిస్థితి ఏర్పడుతోంది.. కడుపున పుట్టిన కుమార్తెలు.. కుమారులు తల్లిదండ్రుల అంత్యక్రియలకు దూరంగా ఉంటున్నారంటే.. ఆన్లైన్లో అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్నారు అంటే పరిస్థితి ఎంత దారుణంగా మారిపోయిందో అర్థం చేసుకోవచ్చు.

హర్యానా రాష్ట్రంలో సానిపట్ ఏరియాలో ఒక వ్యాపారవేత్త ఉన్నాడు. అతనికి పిల్లలు కూడా ఉన్నారు. వారు వేరే ప్రాంతాలలో సెటిల్ అయ్యారు. ఆ వ్యాపారవేత్త అనారోగ్యంతో చనిపోయాడు. భారీగా






సంపాదించినప్పటికీ కన్న పిల్లలు దగ్గరగా లేకపోవడంతో వృద్ధాశ్రమంలో చేరాడు. ఒంటరితనంతో బాధపడుతూ కన్నుమూశాడు. కుమార్తెలు కన్న తండ్రి కడసారి చూపు కూడా రాలేకపోయారు. చివరికి అంత్యక్రియలను మొబైల్ ఫోన్లో ఆన్లైన్లో చూశారు. వీడియో కాల్ ద్వారా ఆ వ్యవహారం చూసి సరిపెట్టుకున్నారు. అంతేకాదు తమ తండ్రి చివరి ఖర్చులకు కేవలం 5100 మాత్రమే పంపి.. తన బాధ్యత తీరిపోయిందని భావించారు..

కన్న పిల్లల్ని ఈ లోకంలోకి తీసుకురావడానికి తల్లిదండ్రులు ఎంత కష్టపడతారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. పిల్లల కోసం తల్లిదండ్రులు తమ జీవితాలను ధారపోస్తారు. కానీ చివరి ప్రయాణంలో కన్న పిల్లలు తల్లిదండ్రులకు తోడుగా ఉండలేకపోతున్నారు.. విలాసవంతమైన జీవితాలకు అలవాటు పడి.. వ్యాపారాత్మకమైన బతుకులు బతుకుతూ.. కోట్లు సంపాదించి.. ఉన్నత హోదాలో స్థిరపడి.. చివరికి కన్నవారి రుణం కూడా తీర్చుకోలేని చదువులేందుకు.. ఆ సంస్కారం లేని బతుకులేందుకు.. అంతిమక్షణాలలో టెక్నాలజీ అందించే డిజిటల్ దృశ్యాలు.. ఆన్లైన్లో మనీ ట్రాన్స్ఫర్లు.. కన్న పేగు ప్రేమను చూపిస్తాయా.. తల్లిదండ్రుల ప్రేమకు ప్రత్యామ్నాయంగా నిలుస్తాయా.. బతికి ఉన్నప్పుడే తల్లిదండ్రులను గుండెల్లో పెట్టుకోవాలి. వారిని ఆదరించాలి. చివరి ఘడియలలో తోడుగా నిలబడాలి. అది పిల్లల కనీస ధర్మం. కనిపించిన వారిని ఓల్డ్ ఏజ్ హోమ్లకు పరిమితం చేయడం.. చివరికి వారి చావును కూడా వీడియో కాల్స్ ద్వారా చూడడం.. మమకారాన్ని తెంచేసుకోవడం అత్యంత ఘోరం.. మానవత్వానికే మచ్చ తెచ్చే దారుణం..

బతికి ఉన్నప్పుడు కంటపడని కన్నప్రేమ.. కన్నుమూశాక వీడియో కాల్ దర్శనం! ఎటు పోతోంది ఈ సమాజం?!

రెక్కలు ముక్కలు చేసుకుని పెంచి పెద్ద చేసిన కన్నప్రేమ పట్ల ఆప్యాయత, బాధ్యతలు ఏమైపోతున్నాయి?

నేటి సమాజంలో యంత్రాల్లా మారుతున్న మానవ సంబంధాలు, మంటగలిసిపోతున్న నైతిక విలువలకు ఈ దృశ్యమే ప్రత్యక్ష నిదర్శనం.

హరియాణాలోని సోనిపట్‌కు చెందిన ఒకప్పటి ప్రముఖ వ్యాపారవేత్త జీవిత చరమాంకంలో ఒంటరితనంతో కుమిలిపోతూ వృద్ధాశ్రమంలో తుదిశ్వాస విడిచారు.

ఆస్తులు, అంతస్తులు సంపాదించినా, పిల్లలను ఉన్నత స్థితిలో నిలబెట్టినా.. ఆయన చివరి ప్రయాణంలో మిగిలింది మాత్రం అనాథ శవంగా మారిన వేదనే.

కుమార్తెలు కన్నతండ్రి కన్నుమూసినా కడసారి చూపుకైనా రాలేకపోయారు. ఆఖరికి అంత్యక్రియలను కూడా మొబైల్ ఫోన్‌లో వీడియో కాల్ ద్వారా వీక్షిస్తూ సరిపెట్టుకున్నారు. తండ్రి చివరి కార్యాల ఖర్చుల కోసం కేవలం రూ.5,100 పంపి తమ బాధ్యత తీరిపోయిందనుకున్నారు.

మిమ్మల్ని ఈ లోకంలోకి తెచ్చి, మీ భవిష్యత్తు కోసం తమ జీవితాలనే ధారపోసిన కన్నతండ్రి ఆఖరి ప్రయాణంలో తోడుగా నిలబడలేని ఈ విలాసవంతమైన, వ్యాపారాత్మక బతుకులు ఎందుకు? కోట్లు సంపాదించినా, ఉన్నత హోదాల్లో స్థిరపడినా కన్నవారి రుణం తీర్చుకోలేని చదువులు, సంస్కారం ఏ పాటివి?

చివరి క్షణాల్లో సాంకేతికత అందించే డిజిటల్ స్క్రీన్లు, ఆన్‌లైన్ మనీ ట్రాన్స్‌ఫర్‌లు కన్నపేగు అనుబంధానికి ప్రత్యామ్నాయం కాగలవా?

తల్లిదండ్రులు బతికున్నప్పుడు వారిని గుండెల్లో పెట్టుకుని ఆదరించడం, వారి ఆఖరి ఘడియల్లో తోడుగా నిలవడం పిల్లలుగా ప్రాథమిక ధర్మం.

కన్నవారిని వృద్ధాశ్రమాలకు పరిమితం చేయడం, వారి మరణాన్ని కూడా వీడియో కాల్స్ ద్వారా చూస్తూ మమకారాలను తెంచేసుకోవడం అత్యంత శోచనీయం.

మానవత్వానికే మచ్చ తెచ్చే ఇలాంటి సంస్కృతి మారాలి.

**ట్విట్టర్ లో సీపీ సజ్జనార్**

# ఎంపీ అరవింద్ సెటైర్ వేస్తే సీఎం రేవంత్ రిటైర్ కావాల్సిందే

రాజకీయ నాయకులు ఒకప్పుడు విమర్శలు చేసుకునేవారు. ఆ తర్వాత ఆరోపణలు మొదలయ్యాయి. ఇప్పుడు ఏకంగా వ్యక్తిగత దూషణలదాకా వచ్చాయి. విమర్శలు.. ఆరోపణలు.. వ్యక్తిగత దూషణలు.. ఇప్పుడు టెక్నాలజీని ఉపయోగించి.. ప్రత్యర్థుల మీద అభియోగాలు మోపుకుంటున్నారు. ఇది కొంతమందికి ఆనందాన్ని కలిగిస్తుంటే.. మిగతా వారికి మాత్రం ఇదేంటి రాజకీయాలు ఇలా అయిపోతున్నాయని బాధ కలిగిస్తుంది. అయినప్పటికీ రాజకీయ నాయకులు ఊరుకోవడం లేదు. కేవలం ప్రత్యర్థుల మీద బురద చిమ్మడానికి.. ఇష్టానుసారంగా వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. దీనివల్ల రాజకీయాలు అంటేనే ఏవగింపు కలుగుతుంది.

అధికారంలో ఉన్న నాయకులు తాము చేసిన అభివృద్ధి గురించి.. ప్రజలు చేసిన మేలు గురించి చెప్పుకోగలగాలి. విపక్షంలో ఉన్న నాయకులు ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావాలి. ప్రజలకు అన్యాయం జరిగితే నేరుగా రంగంలోకి దిగి నిరసనలకు పాల్పడాలి. కానీ తెలుగు రాష్ట్రాలలో రాజకీయాలు చాలా విచిత్రంగా సాగుతున్నాయి. నాయకులు పోటాపోటీగా విమర్శలు.. ఆరోపణలు.. వ్యక్తిగత దూషణలు.. అభియోగాలు దాటిపోయి.. సైన్స్ అండ్ టెక్నాలజీ ద్వారా ప్రత్యర్థుల మీద తమకున్న కోపాన్ని.. ఇంకా రకరకాల ఆవేశాలను వేరే విధంగా తీర్చుకుంటున్నారు.

తాజాగా నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఒక వీడియో విడుదల చేశారు. అందులో ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి ప్రస్తావన ఉంది. రేవంత్ రెడ్డి తీరును ఆయన విమర్శిస్తూ ఒక వీడియో రూపొందించారు. అందులో తెలంగాణ భౌగోళిక స్వరూపం మీద రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఆయన ఒక మ్యాప్ రూపొందించారు. తెలంగాణ సరిహద్దుల్లో అరేబియా మహాసముద్రం.. బంగాళాఖాతం.. హిందూ మహాసముద్రం.. హిమాలయ పర్వతాలు అందులో ఉన్నట్టు చూపించారు. ఇదీ రేవంత్ రెడ్డి నూతన తెలంగాణ.. ఇందులో హైడ్రా కూడా ఉంటుంది అని అరవింద్ క్యాప్షన్ ఇవ్వడం విశేషం.

అరవింద్ రూపొందించిన ఈ వీడియో లో రేవంత్ మీద ఉన్న ఆయనకు ఉన్న కోపం కనిపిస్తోంది. అయితే నేరుగా ఆయన విమర్శించకుండా.. టెక్నాలజీ సాయంతో ఆయన చేసిన వ్యాఖ్యలను ట్రోల్ చేసే విధంగా ఈ వీడియో రూపొందించారు. ఈ వీడియోను బిజెపి శ్రేణులు విస్తృతంగా వ్యాప్తిలోకి తీసుకొస్తున్నాయి. దీనిపై కాంగ్రెస్ నాయకులు కూడా అదే స్థాయిలో రెస్పాండ్ అవుతున్నారు. గతంలో మోడీ మాట్లాడిన మాటలను.. బిజెపి పెద్దలు మాట్లాడిన మాటలను.. ధర్మపురి అరవింద్ మాట్లాడిన మాటలను ఈ సందర్భంగా వారు ప్రస్తావిస్తున్నారు.. మొత్తానికి అరవింద్ తీసుకొచ్చిన వీడియో



కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ అన్నట్టుగా పరిస్థితిని మార్చేసింది.

# కొరియన్ కనకరాజు మూవీ రివ్యూ : బొమ్మ హిట్టా ఫట్టా...

మెగా ఫ్యామిలీ హీరోలందరు వరుసగా సక్సెస్ ల బయపడుతున్నారు. ఇక అదే రీతిలో వరుణ్ తేజ్ సైతం సక్సెస్ ట్రాక్ ఎక్కాలనే తీవ్రమైన ప్రయత్నం చేస్తున్నాడు. అందులో భాగంగానే 'కొరియన్ కనకరాజు' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఈ సినిమా ఎలా ఉంది సగటు ప్రేక్షకుడిని మెప్పించిందా? లేదా అనే విషయాన్ని మనం ఒకసారి తెలుసుకుందాం...

### కథ

కనకరాజు అనంతపురంలోని ఒక ఏరియాలో భజన బృందాన్ని నడుపుకుంటూ డబ్బులు సంపాదిస్తుంటాడు. ఇక ఈ క్రమంలోనే తన అన్న అయిన అవసరాల శ్రీనివాస్ సింగపూర్ లో బిజినెస్ పెట్టడానికి 10 లక్షల రూపాయలు కావాలంటే తన అన్న బిజినెస్ కోసం కనకరాజు వల్ల అమ్మ నాన లను ఒప్పించి సునీల్ దగ్గర వాళ్ల ఇల్లు తాకట్టు పెట్టి ఆ డబ్బులు ఇచ్చి అతన్ని సింగపూర్ కి పంపిస్తాడు... అలాగే కనకరాజు కి కోపం ఎక్కువగా ఉండటం తో సునీల్ వాళ్ల మనిషిని కొడతాడు. సునీల్ తో గొడవ పెట్టుకుంటాడు. అలాగే కనకరాజు రోజు మందు తాగడానికి ఏదో ఒక కారణాన్ని వెతుకుంటాడు. కనకరాజు తన ఫ్రెండ్ సత్య తో కలిసి రోజు వైన్స్ లో మధు తాగుతాడు.

ఒక రోజు బార్ లో ఫైట్ జరుగుతున్నప్పుడు ఒక కొరియన్ గ్యాంగ్ స్టర్ అస్థికలు ఉన్న బాటిల్ లో కనకరాజు మందు కలుపుకొని తాగుతాడు. దాంతో అప్పటి నుంచి ఆ కొరియన్ గ్యాంగ్ స్టర్ ఆత్మ కనకరాజు బాడిలోకి వస్తుంది... దీనివల్ల కనకరాజు కి తెలియకుండానే చాలా దారుణాలు చేస్తుంటాడు. ఇక ఇలాంటి క్రమంలోనే కనకరాజు బాడీ నుంచి ఆ ఆత్మ ను ఎలా వేరు చేశారు. కనకరాజు వాళ్ల అన్నయ్య ఎక్కడ ఉన్నాడు అనేది తెలియాలంటే మీరు ఈ సినిమా చూడాల్సిందే...

### విశ్లేషణ

దర్శకుడు మేర్లపాక గాంధీ మొదటి నుంచి కథను ఎంటర్ టైన్ మెంట్ వే లోనే తీసుకెళ్లాడు. ఒక ఆత్మ ద్వారా కనకరాజు కొరియన్ కనకరాజు ఎలా అయ్యాడు అనే పాయింట్ పేపర్ మీద ఉన్నప్పుడు ఇంట్రెస్టింగ్ గానే అనిపించినప్పటికి దానిని స్క్రీన్ మీద అంత ఎఫెక్టివ్ గా ప్రజెంట్ చేయలేకపోయాడు... చాలా వరకు ఫస్ట్ హాఫ్ బోరింగ్ గా సాగింది. ఇక సెకండాఫ్ అయితే ఎప్పుడై పోతుందా అనిపించింది. నిజానికి సత్య కామెడీ మధ్యలో కొంచెం రిలాక్సేషన్ ఇస్తుందేమో అనుకుంటే అది కూడా ప్రపర్ గా వర్కౌట్ కాలేదు...ఇక క్లైమాక్స్ గురించి మాట్లాడుకోకపోవడమే బెటర్... అది ఏఐ ద్వారా క్రియేట్ చేసిన ఆత్మ లతో ఫైట్ పెట్టారు. ఏంటబ్బా ఈ రోజుల్లో కూడా అలాంటి సిల్లీ ఫైట్స్...




అయిన కాన్సెప్ట్ ప్రకారం ఆత్మ రావడం ఏంటి అవి ఫైట్స్ చేసుకోవడం ఏంటి? కనకరాజు చనిపోయాక మళ్ళీ బతకడం ఏంటి? ఇవన్నీ చాలా ఆర్టిఫీషియల్ గా ఏదో జరగాలి. కాబట్టి జరుగుతుంది అంతే తప్ప పెర్ఫెక్ట్ లాజికల్ గా మాత్రం వర్కౌట్ చేయలేదు... చాలా రొటీన్ టెంప్లేట్ లో సినిమా సాగింది. ఎంటైర్ సినిమాలో హైలెట్ సీన్స్ ఏమున్నాయి అని ఆలోచిస్తే ఒక్కటి కూడా దొరకడం లేదు...చాలా పూర్ రైటింగ్ ఉంది. మ్యూజిక్ ఒకే అనిపించింది. ముఖ్యంగా బ్యాగ్రౌండ్ స్కోర్ బాగుంది. ఇంటర్వెల్ సీన్ లో బ్యాగ్రౌండ్ స్కోర్ పర్లేదు అనిపించేలా ఉంది...సెకండాఫ్ లో ఆ కొరియన్ దయ్యం గాడు రావడమేంటి వాడు చేసే రచ్చ రచ్చ ను మనమెందుకు భరించాలి అనేంత చిరాకు పుడుతుంది..

ఇక హీరోయిన్ పాత్ర కి పెద్దగా ఇంపార్టెన్స్ అయితే ఏమీ లేదు. ఏదో సినిమాలో ఉంది కదా అంటే ఉంది అంతే తప్ప పర్టికులర్గా సినిమా ఎప్పుడు కూడా డిపెండ్ అయి ముందుకు సాగలేదు... కామెడీ సన్నివేశాలు సిచువేషన్ కి తగ్గట్టుగా అంత పర్ఫెక్ట్ గా సెట్ అవ్వలేదనే చెప్పాలి...

### ఆర్టిస్టుల పర్ఫామెన్స్...

ఈ సినిమాలో వరుణ్ తేజ్ పక్కా విలేజ్ కుర్రాడిలా కనిపించడానికి చాలా బాగా కష్టపడ్డాడు. అలాగే కొరియన్ వ్యక్తి ఆత్మ కనకరాజు బాడీ లోకి వచ్చినప్పుడు వరుణ్ తేజ్ యాక్టింగ్ చాలా బాగుంది... అలాగే సత్య గురించి చెప్పాలి అంటే ఆయన పెర్ఫెక్ట్ తన కామెడీ టైమింగ్ ను ఫాలో అవుతూ చాలా మంచి కామెడీ చేశాడు... మిగతా ఆర్టిస్టులందరు తమ పాత్ర పరిధి మేరకు ఒకే అన్నారు...

### టెక్నికల్ అంశాలు...

సినిమాలో విజువల్స్ కొన్ని బాగున్నాయి... బ్యాగ్రౌండ్ స్కోర్ బాగుంది...సాంగ్స్ విషయంలో ఇంకొంచెం స్పెషల్ కేర్ తీసుకుంటే బాగుండేది...ప్రొడక్షన్ వాల్యూస్ కూడా బాగున్నాయి...ఎడిటింగ్ వర్క్ ఇంకొంచెం షార్ప్ గా ఉంటే బాగుండేది... ఈ మూవీలో అంత పెద్ద లెంత్ ఉన్న సీన్స్ అవసరం లేదు... వాటిని ఇంకొంచెం ట్రిమ్ చేసి ఉంటే బాగుండేది...

### ప్లస్ పాయింట్స్...

వరుణ్ తేజ్ యాక్టింగ్
సత్య కామెడీ సీన్స్

### మైనస్ పాయింట్స్

రొటీన్ ఆత్మ కథ
సెకండాఫ్ టోటల్ గా డల్ అయింది...
క్లైమాక్స్ లో అదంతా అవసరం లేదు...

**రేటింగ్ 2/5**

# KJQ మూవీ ఫస్ట్ రివ్యూ

దీక్షిత్ శెట్టి శశి ఓదెల హీరోలుగా చేస్తున్న **KJQ** సినిమా రేపు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. దర్శకుడు కిరణ్ ఈ సినిమాని చాలా అద్భుతంగా తెర్కెక్కించాడు అనే వార్తలైతే వస్తున్నాయి. కిరణ్ సినిమా రిలీజ్ కి ముందే అనారోగ్య కారణంతో చనిపోవడం వల్ల ఈ సినిమాను చాలామంది దర్శకులు ముందుకు వచ్చి ప్రమోషన్స్ లలో పాల్గొంటు న్నారు. ముఖ్యంగా కేడి సినిమా సమయంలో కిరణ్ దగ్గర డైరెక్షన్ డిపార్ట్మెంట్లో పనిచేసిన సందీప్ రెడ్డి వంగా సైతం ఈ సినిమా ప్రమోషన్ లో పాల్గొన్నాడు. అలాగే సంపత్ నంది సైతం సినిమా ఈవెంట్ కి చీఫ్ గెస్ట్ గా హాజరయ్యాడు. శ్రీకాంత్ ఓదెల సైతం ఈ సినిమా ఈవెంట్లో భాగమవ్వడం విశేషం...ఇక ఈ మూవీ రేపు రిలీజ్ అవ్వనున్న నేపథ్యంలో ఇప్పటికే ఈ సినిమాకి సంబంధించిన కొన్ని షోస్ ని సినిమా ఇండస్ట్రీలోని కొంతమంది సినిమా మేధావులకైతే వేశారు. ఈ సినిమాని చూసిన వాళ్ళు ఎలా రెస్పాండ్ అవుతున్నారనే విషయాలు మనం ఒకసారి తెలుసుకుందాం...

అధికారం కోసం పాటుపడే కింగ్ అనే వ్యక్తి తన జీవితంలో ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నారు. అతని స్నేహితులు తనని వదిలేసి ఎందుకు వెళ్లారు. తను ఎలాంటి దారిని ఎంచుకొని ముందుకు సాగుతున్నాడు. ఫైనల్ గా ఆయన ఏం సాధించాడు అనేదే ఈ సినిమా స్టోరీగా తెలుస్తుంది.

ఇక దీక్షిత్ శెట్టి ఈ సినిమాలో మరోసారి చాలా చక్కటి పర్ఫామెన్స్ అయితే ఇచ్చాడట. మొత్తానికైతే దర్శకుడు కిరణ్ ఈ సినిమాని చాలా డిఫరెంట్ స్క్రీన్ ప్లే తో తెరకెక్కించి నట్టుగా తెలుస్తుంది. సినిమాను చూసిన సినిమా సెలబ్రిటీలు సైతం సినిమా మీద పాజిటివ్ గా స్పందించడం ఒక రకంగా సినిమా యూనిట్ కి చాలా మంచి బూస్టప్ ఇచ్చింది.

అలాగే సినిమాలో సాంగ్స్ ఓకే అనిపించినప్పటికి బ్యాగ్రౌండ్ స్కోర్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నట్టుగా తెలుస్తుంది. ఇక ఏది ఏమైనా కూడా ఈ సినిమా ప్రేక్షకులను మెప్పిస్తుందా? లేదా అనేది తెలియాలంటే మాత్రం మరికొన్ని గంటల పాటు వెయిట్ చేయాల్సిందే...






## సంప్రదాయ అందాలతో మెరిసిన సాన్యా ఠాకూర్

**అందం, అభిరుచి, సంప్రదాయం కలిసొస్తే ఆ లుక్‌కు ప్రత్యేక ఆకర్షణ ఏర్పడుతుంది. అలాంటి ఆకట్టుకునే రూపంతో నటి సాన్యా ఠాకూర్ మరోసారి అభిమానులను మంత్రముగ్ధులను చేసింది.తాజాగా ఆమె పంచుకున్న ఫొటోల్లో ఆలివ్ గ్రీన్ రంగు చీరను ధరించి ఎంతో హుందాగా కనిపించింది. రంగురంగుల డిజైన్‌తో ఉన్న బ్లౌజ్ ఆమె లుక్‌కు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. సంప్రదాయ జుమ్కాలు, సున్నితమైన నడుము వడ్డాణం (వెస్ట్ చైన్) ఆమె అందాన్ని మరింత రెట్టింపు చేశాయి.**

Printed and published by oktelugu Chairmen Bhaskar Rao Katiki, on behalf of Swarna Enterprises Private Limited. Hitec ciry, Hyderabad-500030.
Editor: A.Naresh email: oktelugu.com@gmail.com